సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



భావిభారత పరిశోధకులు
పలువురు విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికై ప్రశంసలు పొందాయి.
- 8లో



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
యాదగిరిగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.
- 8లో



ఎద్దుల పందేలు
మేళ్లచెరువు జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఉత్కంఠ భరితంగా కొనసాగున్నాయి.
- 8లో

ఓటెత్తిన ఉపాధ్యాయులు

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఉమ్మడి జిల్లాలో 94.98 శాతం పోలింగ్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఉపాధ్యాయులు

- పోలింగ్ కేంద్రాలకు బారులుతీరిన ఓటర్లు
- మధ్యాహ్నం 2 గంటల వరకే 76 శాతం నమోదు
- 4 గంటల వరకు ముగిసిన పోలింగ్
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ
- నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఉపాధ్యాయ ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 10 గంటల వరకు మందకొడిగా వచ్చిన ఓటర్లు ఆ తరువాత అధిక సంఖ్యలో వచ్చారు. గంట గంటకు ఓటర్ల రాక పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ భారీగా నమోదైంది. మొత్తానికి నిర్దిష్ట సమయానికే సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 94.98 శాతం పోలింగ్ నమోదైంది.



ఏవీఎం పాఠశాలలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పోలింగ్ కేంద్రాల వద్ద సంఘాల హడావుడి

పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా అభ్యర్థులకు సంఘాలు, అనుచరులంతా టెంట్‌లు వేసుకుని పోల్‌చిట్టీలు అందించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు.. వారి ఓటు ఏ బూత్‌లో ఉందనేది జాబితాలో చూసి పోల్ చిట్టీలు అందజేశారు. ఆయా అభ్యర్థులకు సంబంధించిన అనుచరులు, సంఘాల నాయకులు టెంట్లు ఏర్పాటు చేసుకుని కూర్చున్నారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా అదనపు కలెక్టర్ పరిశీలన

జిల్లాలో 23 కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబు వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, ఈడీఎం గఫార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ఓటు హక్కు వినియోగించుకొని సిరా చూపిస్తున్న ఉపాధ్యాయులు

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం ఇలా..

జిల్లా	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
యాదాద్రి	984	950	96.54
సూర్యాపేట	2664	2530	94.97
నల్లగొండ	4683	4433	94.66

పోలింగ్ సరళి పరిశీలన



ఎమ్మెల్సీ ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఏవీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రంలో 991 ఓట్లకు గాను 935 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,664 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే చివ్వెంల మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వేణుమాధవరావు, డీఎస్పీ రవి, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు



భద్రపర్చిన బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్

పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు గురువారం సాయంత్రం నుంచి రావడం మొదలైంది. అక్కడ రిసెప్షన్ సెంటర్‌లో నమోదు చేసుకున్న తర్వాత రాజకీయ ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు అర్ధ రాత్రి దాటిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి.

పెన్షనర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



హుజూర్‌నగర్: ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో పెన్షనర్ల సంఘం నేతలు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం హుజూర్‌నగర్‌లోని మంత్రి నివాసంలో ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాల పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కోదాడలో వచ్చేనెల 16, 17, 18 తేదీల్లో ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాలు నిర్వహించాలనుకోవడం సాహసోపేతమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, సంఘం నాయకులు దేవదానం, ఎంఎస్ఎన్ రాజు, వీరబాబు, చంద్రశేఖర్, తాటి ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇంకా.. కొత్త సంఘాలు

- జిల్లాలో నూతనంగా 165 స్వయం సహాయక సంఘాల ఏర్పాటు
- 5,280 మంది మహిళలకు సభ్యులుగా అవకాశం
- వనితల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



తాటిపాములలో సమావేశమైన మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి): రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సభలు, సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిస్తున్నారు. దీంతో తమకు ఆర్థిక భరోసా లభిస్తుందని గ్రామీణ ప్రాంత మహిళలు ఆశతో ఎదురు చూస్తున్నారు. మహిళలను ఆర్థికంగా స్థితిమంతులను చేయాలనే లక్ష్యంతో దశాబ్దాల క్రితం మహిళా పొదుపు స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వాలు దశల వారీగా కృషి చేశాయి. దీంతో గ్రామాల్లో 80 శాతం ఇళ్లలో కనీసం ఒక్కరైన మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి బ్యాంకుల నుంచి వస్తున్న రుణాలతో పాటు ప్రభుత్వం నుంచి లభించే వివిధ రాయితీ పథకాలను మహిళా సభ్యులు అందిపుచ్చుకున్నారు. తక్కువ వడ్డీ, ఒక్కోసారి వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందారు. ప్రస్తుతం ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా మరికొన్ని సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 5,280 మంది సభ్యులతో 165 కొత్త సంఘాలను నెలకొల్పారు. దీంతో జిల్లాలో మొత్తం 17,579 సంఘాలు అయ్యాయి. వీటిలో 1,83,782 మంది మహిళా సభ్యులు ఉన్నారు.

కొత్తగా స్వయం సహాయక సంఘాలు 165	మండలాలు 23
	మొత్తం సంఘాలు 17,579
వీటిలో మహిళా సభ్యులు 5,280	సభ్యులు 1,83,782

నిర్వహణపై శిక్షణ

కనీసం పది మంది సభ్యులతో ఏర్పాటైన కొత్త సంఘాల సభ్యులకు ఆయా సంఘాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా డబ్బులు పొదుపు చేయడంతో పాటు అందుకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, బ్యాంకుల ద్వారా వచ్చే రుణాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. సభ్యులు తీసుకున్న ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని, తిరిగి చెల్లింపు అంశాలపై కూడా ఆర్పీలు, సీఏలు సంఘాల వారీగా శిక్షణ ఇస్తున్నారు.

న్యూస్‌రీల్

మెనూ అమలు చేయని వారిపై కఠిన చర్యలు



రాత్రి బస చేస్తున్న సంక్షేమ అధికారిణి

సూర్యాపేట : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన మెనూ అమలు చేయని హాస్టల్ వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి లత హెచ్చరించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం (ఏ) లో రాత్రి బస చేశారు. హాస్టల్ లో అమలవుతున్న నూతన మెనూ వివరాలను విద్యార్థిను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అత్యధికంగా ఖర్చు చేసి విద్యార్థులకు నూతన మెనూ అమలు చేస్తుందన్నారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులకు చేరే విధంగా ప్రతి హాస్టల్ లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే పరీక్షలకు విద్యార్థులంతా సిద్ధం కావాలని కోరారు. ప్రణాళికా బద్ధంగా సిలబస్ పూర్తి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓ మహబూబా పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో గురువారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. దానిలో భాగంగా సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం ,రక్షాబంధనం ,రుత్విగ్వరణం ,మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామివారిని ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడవాహనంపై ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి , ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు వైభవంగా నిర్వహించారు. వేవకుజామున సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, ప్రతిష్ఠా మూర్తులను అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం చేశారు. ఆతరువాత స్వామి, అమ్మవారిని గజవాహన సేవలో ఊరేగించి నిత్య తిరుకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన రాచకొండ పర్యాటక ఉత్సవాలు

సంస్థాన్ నారాయణపురం : రాచప్ప సమితి ఆధ్వర్యంలో రాచకొండలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలు గురువారం ముగిశాయి. భక్తులు, పర్యాటకులు ఉత్సవాల్లో పాల్గొని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాచకొండ చరిత్రను తెలియజేసే ఫొటో గ్యాలరీతో పాటు పర్యాటక ప్రదేశాలను వీక్షించారు. రాచప్ప సమితి అధ్యక్షుడు మాట్లాడుతూ రాచకొండను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.

మేళ్లచెరువులో శివపార్వతుల కల్యాణం



విశేష అలంకరణలో స్వామి వారు



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండలకేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి వారి కల్యాణం గురువారం తెల్లవారుజామున మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నుంచి కల్యాణ మంటపం వరకు స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, విష్వక్సేన పూజ చేసి వేదమంత్రాల సాక్షిగా స్వామి వారు అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కొంకపాక కృష్ణమూర్తి శర్మ, విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ , పోశం నర్సిరెడ్డి, ఆలయ మేనేజర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజూ సాగిన మహా శివరాత్రి జాతర

మేళ్లచెరువు మండలకేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండవ రోజైన గురువారం కూడా జాతర కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకాలు, బలిహరణ, పుష్పాలంకరణ, మహానివేదన, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయంలో కోలాట మాడారు. భజనలు చేశారు. గిరిజన మహిళలు నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

స్వామి వారి సన్నిధిలో ఉన్న గంగమ్మ అమ్మవారికి యాదవులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలతో వచ్చి అమ్మవారికి మేకపోతులు బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజు అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



మేళ్లచెరువులోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఎయిడ్స్ అవగాహన సదస్సుకు నిధులు విడుదల

నల్లగొండ టూటౌన్ : జాతీయ సేవా పథకం, ఎంజీ యూనివర్సిటీ ఇటీవల రెండు రోజుల పాటు రెడ్ రిబ్బన్ క్లబ్, పీర్ లీడర్స్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సు విజయవంతమైంది. దీంతో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నుంచి నిధులు విడుదలైనట్లు యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నిధుల విడుదల ఉత్తర్వులను డాక్టర్ మద్దిలేటికి అందజేశారు. ఒక రోజు ఉమ్మడి జిల్లాలోని రెడ్ రిబ్బన్ కాలేజీల్లో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రొఫెసర్ ఆకుల రవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, హరికిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భానుపురి సైన్స్ సంబరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నేతలు

సూర్యాపేటటౌన్ : సైన్స్ డే సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం భానుపురి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్ళమూడి రమేష్ బాబు తెలిపారు. సూర్యాపేటలో సైన్స్ సంబరాల పోస్టర్లను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. మిరాకిల్ స్ట్రీట్ సైన్స్ షో, విజ్ఞాన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాజెక్టుల ప్రదర్శన, సైన్స్ స్కిట్స్, ముఖాభినయాలు తదితర విజ్ఞానాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. జనవిజ్ఞాన వేదిక, సూర్యాపేట సైన్స్‌ఫోరం , ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సైన్ సంబరాల్లో అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చని సూచించారు. గత ఆదివారం ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు కన్వీనర్ తల్లాడ రామచంద్ర తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ జాఫర్, సీనియర్ నేతలు నారాయణరెడ్డి, డి.నాగరాజు, ఉపేందర్, సోమ సురేష్ కుమార్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

సరిపడా రాని యూరియా



ఆత్మకూర్ మండల కేంద్రంలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

- రైతులకు అందని యూరియా బస్తాలు
- పలు మండలాల్లో వచ్చిన యూరియా వచ్చినట్లే ఖాళీ
- సమయానికి వేయకపోవడంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన

భానుపురి (సూర్యాపేట) : అన్నదాతలకు పంటలు వేసిన నాటినుంచి డబ్బులు చేతికి అందేదాకా తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం జిల్లాలోని పలు మండలాల్లో యూరియా కొరత నెలకొంది. అది కూడా ఆలస్యంగా సాగు చేసిన వరి పొలాలకు వేయడానికి రైతులు కొంత ఇబ్బందులు పడుతున్నారు. ఈ పొలాలు సైతం పొట్టదశలో ఉన్నాయి. ఒకట్రెండు రోజుల్లో వేయాల్సిన యూరియాను వారం, పదిరోజులు ఆలస్యంగా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అడుగంటిన భూగర్భ జలాలు, వట్టిపోయిన బోర్లతో నెట్టుకొస్తున్న రైతులకు ఈ సమస్య మరింత వెనక్కి నెట్టుతోంది. అంతంత మాత్రంగానే పారుతున్న పొలాలు.. యూరియా లేకపోవడంతో ఏపుగా పెరగకుండా దిగుబడి తగ్గుతుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. యూరియా తిప్పలు అంతటా లేకపోగా.. ఉన్నచోట రైతుకు కేవలం రెండు నుంచి మూడు బస్తాలను మాత్రమే ఇస్తున్నారు.

4.30 లక్షల ఎకరాల్లో వరి సాగు

సూర్యాపేట జిల్లాలో కొన్నేళ్లుగా వరి సాగే అత్యధికంగా ఉంటోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఓ వైపు సాగర్, మూసీ, ఎస్సారెస్పీ నీళ్లు అందుతుండడంతో ఇతర పంటల సాగును రైతులు వదిలేశారు. ఈ యాసంగి సీజన్‌లో 4.78 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ లెక్కన జిల్లా రైతాంగానికి 68,280 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని భావించగా.. సీజన్ ప్రారంభానికే జిల్లాలో 19,037 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉంది. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి జిల్లాలో 56వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వాడారు. నాటినుంచి మరో 10వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినా.. కొన్ని మండలాల్లో కొరత ఉంది.

ఆలస్యంగా సాగు చేయడంతో..

జిల్లాలోని సాగర్, మూసీ ఆయకట్టు ప్రాంతాలకు సరైన సమయానికే నీటిని విడుదల చేశారు. కానీ ఎస్సారెస్పీ ఆయకట్టుకు జనవరి 1వ తేదీన ఇవ్వడంతో చాలామంది రైతులు ఆలస్యంగా నాట్లు వేశారు. ముందుగా బోరు బావులతో పాటు సాగర్, మూసీ ఆయకట్టు కింద పడిన నాట్లకు రైతులు రెండోదఫా కూడా యూరియాను చల్లారు. ఇక తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో ఆలస్యంగా సాగైన వరి పొలాలకు రెండోదఫా అందించాల్సిన యూరియా సమయానికి అందడం లేదు. వాతావరణ పరిస్థితులు, చాలీచాలని నీళ్లు తదితర సమస్యలతో అంతంత మాత్రమే ఉన్న పొలాలు పొట్టదశకు వచ్చే సమయానికి రెండోదఫా యూరియా లేకపోవడంతో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో ఉన్న రైతాంగానికి ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వచ్చిన యూరియా వచ్చినట్లుగా అయిపోతుండగా.. ఒక్కో రైతుకు రెండు, మూడు బస్తాల చొప్పున మాత్రమే ఇస్తున్నారు.

క్లుప్తంగా

కోడి పందేల నిర్వాహకులపై కేసు

మద్దిరాల: రహస్యంగా కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై గురువారం మద్దిరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం. వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం చందుపట్ల గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ భూమిలో చందుపట్ల గ్రామానికి చెందిన సురేష్, మహేష్, ఊకట్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్, శ్రీను, పస్తాల గ్రామానికి చెందిన ఎల్లయ్య, నూతనకల్లు గ్రామానికి చెందిన సైదు వెంకట నాగరాజు కొన్నిరోజులుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్ఐ మల్లయ్య పోలీస్ సిబ్బందితో కలిసి వ్యవసాయ క్షేత్రంపై దాడి చేసి నాలుగు పందెం కోళ్లు, 16 కత్తులు, రెండు బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, ఆటోతో పాటు రూ.4800 నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హుక్కా తాగుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

మేళ్లచెరువు: హుక్కా తాగుతున్న వారిని సీసీఎస్ పోలీసులు పట్టుకొని మేళ్లచెరువు పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. మేళ్లచెరువు మండల కేంద్రంలో జరుగుతున్న మహాశివరాత్రి జాతరకు పెద్ద సంఖ్యలో యువకులు హాజరయ్యారు. కొంతమంది యువకులు బుధవారం రాత్రి కోదాడ రోడ్డులోని ఓ ఇంట్లో హుక్కా, గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు మేళ్లచెరువు పోలీసులు గురువారం తెలిపారు.


కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

చౌటుప్పల్: చిల్లర ఇచ్చే విషయమై మాటామాట పెరిగి ఆర్టీసీ బస్ కండక్టర్‌పై ప్రయాణికుడు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోకు చెందిన మెట్రో డీలక్స్ బస్సు ప్రయాణికులతో చౌటుప్పల్‌కు వచ్చింది. ప్రయాణికులు టిక్కెట్ తీసుకునే సమయంలో సరిపడా చిల్లర డబ్బులు లేకపోవడంతో బస్సు దిగే సమయంలో ఇస్తానని కండక్టర్ శ్రీధర్‌రెడ్డి టిక్కెట్ వెనుక భాగంలో గుర్తుపెట్టాడు. ఈ క్రమంలో ప్రయాణికులు చౌటుప్పల్ బస్టాండ్‌లో బస్సు దిగిన సమయంలో తన వద్ద సరిపడా చిల్లర లేకపోవడంతో ఇద్దరికి కలిపి చిల్లర ఇస్తున్నాడు. అలా ఇస్తుండడాన్ని వ్యతిరేకించిన చౌటుప్పల్‌కు చెందిన ప్రయాణికుడు కడగంచి జంగయ్య కండక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. తనకు నేరుగా చిల్లర ఇవ్వాలని, మరో వ్యక్తితో కలిసి ఎలా ఇస్తావని కండక్టర్‌ను నిలదీశాడు. అదే సమయంలో మాటామాట పెరగడంతో జంగయ్య కండక్టర్ శ్రీధర్‌రెడ్డిపై చేసుకున్నాడు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి బలవన్మరణం

చిట్యాల: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఉడుగు శ్యాంసుందర్ (29) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన శ్యాంసుందర్ భార్య, తల్లి పూలమ్మతో తరచూ గొడవ పడుతుండేవాడు. కుటుంబ కలహాలు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని శ్యాంసుందర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భావి భారత పరిశోధకులు



- విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న సైన్స్ ఫెయిర్లు

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్లు, ఇన్‌స్పైర్ మనక్ పోటీలు ఎంతగానో దోహదపడతాయి. సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి గల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికై ప్రశంసలు పొందుతున్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయికి ఎంపికైన పలు ఎగ్జిబిట్ల గురించి తెలుసుకుందాం.

భూకంపం వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడుకునే పరికరం



ఉదయ్‌కుమార్, పాలవరం జెడ్పీహెచ్ఎస్, అనంతగిరి

సూర్యాపేటటౌన్: అనంతగిరి మండలం పాలవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఉదయ్‌కుమార్ గైడ్ టీచర్ రాజు పర్యవేక్షణలో భూకంపాలు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రత్యేక పరికరాన్ని తయారు చేశాడు. చెక్క పలకలు, బజర్, హెచ్‌డబ్ల్యూ బ్యాటరీలు, గేజ్ కాపర్ వైరు, ఐరన్ వైరు ఈ పరికరాన్ని ఇంట్లో అమర్చుకోవాలి. భూకంపం వచ్చినప్పుడు ఆ ప్రకంపనలకు చెక్క పలకలు కదిలి దానికి ఉన్న కాపర్ వైరు వలయానికి తగలడం వలన బజర్ శబ్దం మోగుతుంది. దీంతో ప్రజలు అప్రమత్తమై బయటికు వచ్చి ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఇటీవల సూర్యాపేట జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించగా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

ఇంట్లోనే శానిటరీ ప్యాడ్స్ తయారీ



అవంతిక, జలాల్‌పురం జెడ్పీహెచ్ఎస్, తిరుమలగిరి

సూర్యాపేటటౌన్: తిరుమలగిరి మండలం జలాల్‌పురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అవంతిక గైడ్ టీచర్ వై. చంద్రజ్యోతి పర్యవేక్షణలో ఇంట్లోనే శానిటరీ ప్యాడ్స్‌ని తయారు చేసింది. అరటి కాడను చిన్న ముక్కలుగా చేసి ఉడకబెట్టాలి. ఉడకబెట్టే సమయంలో వేపాకులు వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేస్తే దూదిలాగా తయారవుతుంది. దానిని మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని ఫిల్టర్ చేసుకొని నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత మళ్లీ మిక్సీలో వేశాక దారం వలే వస్తుంది. దీంతో శానిటరీ ప్యాడ్స్ తయారుచేసుకోవచ్చు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన ఈ ఎగ్జిబిట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్



తరుణ్, అఖిల్, ఆదర్శ పాఠశాల, తుర్కపల్లి

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులు బానోతు తరుణ్, లునావత్ అఖిల్ గైడ్ టీచర్ కోట నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్ ప్రాజెక్టు తయారు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో 2024 సెప్టెంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్టును ప్రదర్శించగా.. రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జనవరి 7వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ నానో ట్రాక్టర్‌ను ప్రదర్శించగా.. జాతీయ స్థాయికి ఎంపికైంది. తోటల్లో అంతర పంటలు వేసుకునేందుకు పెద్ద ట్రాక్టర్లతో, ఎడ్ల నాగళ్లు తిరగవని గ్రహించారు. చిన్న, సన్నకారులు రైతులకు అతి తక్కువ పెట్టుబడితో వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా బ్యాటరీతో నడిచే ఈ నానో ట్రాక్టర్‌ను రూపొందించారు. ఢిల్లీలో జనవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహించిన యంగ్ ఇండియా ఫెస్టివల్‌లో ఈ నానో ట్రాక్టర్‌ను ప్రదర్శించగా.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ ప్రాజెక్టు గురించి తరుణ్, అఖిల్ వివరించారు.

ఫ్రెండ్లీ డ్రమ్ సీడర్ ఫర్ ఫార్మర్

నల్లగొండ: దామరచర్ల మండలం కొండ్రపోల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సిగంపట్ల ఈశ్వర్ సాయి గైడ్ టీచర్ మట్టమ్మ ప్రోత్సాహంతో రైతుల కోసం ఫ్రెండ్లీ డ్రమ్ సీడర్‌ను తయారు చేశాడు. కరెంట్‌తో సంబంధం లేకుండా వరితో పాటు పప్పు ధాన్యాలు విత్తేందుకు ఈ పరికరం పనిచేస్తుంది. తక్కువ మంది కూలీలతో విత్తనాలు విత్తేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ విత్తనాలు యంత్రానికి రెండు వైపులా వీల్స్ ఏర్పాటు చేసి మధ్యలో విత్తనాలు విత్తే పరికరాలను ఏర్పాటు చేశారు. దాన్ని నెట్టుకుంటూ వెళ్తుంటే మధ్యలో విత్తనాలు పొలంలో పడిపోతాయి. ఈ ప్రాజెక్టు కూడా జాతీయ స్థాయిలో ప్రదర్శించి పలు అవార్డులు పొందారు.

సిగంపట్ల ఈశ్వర్ సాయి, కొండ్రపోల్ జెడ్పీహెచ్ఎస్, దామరచర్ల మండలం



ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శన



ఇరుగు చందన, జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఇరుగు చందన (9వ తరగతి) సైన్స్ ఉపాధ్యాయుడు నోముల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సమగ్ర ప్రకృతి వ్యవసాయంపై రూపొందించిన ఎగ్జిబిట్‌కు సూర్యాపేట జిల్లా కోదాడలో గత డిసెంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి లభించింది. దీంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పంటలు పండించే లక్ష్యంతో సమగ్ర ప్రకృతి వ్యవసాయం ప్రదర్శనను ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జనవరి 7, 8, 9 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లోనూ ఈ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

వాహనాలు చోరీకి గురికాకుండా..



సింగం వివేకవర్ధన్, బగాయత్ ఉన్నత పాఠశాల, భువనగిరి

భువనగిరి: భువనగిరి పట్టణంలోని బాగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి సింగం వివేకవర్ధన్‌కు చిన్నప్పటి నుంచి సైన్స్ పట్ల ఉన్న ఆసక్తితో గైడ్ టీచర్ వెంకటేశ్వర్లు సహాయంతో వాహనాలు చోరీకి గురికాకుండా పరికరాన్ని తయారు చేశాడు. ఈ ఎగ్జిబిట్ గత నవంబర్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించగా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించగా.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరిలోనే జరగాల్సి ఉండగా.. ఇప్పటి వరకు జరగలేదు. వివేకవర్ధన్ తయారు చేసిన పరికరాన్ని వాహనానికి అమర్చుకోవాలి. దానికి యాప్ ద్వారా పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. ఎవరైనా వాహనాన్ని చోరీ చేస్తే వెంటనే వాహనదారుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దీంతో వాహనదారుడు అప్రమత్తయ్యేందుకు అవకాశం ఉంటుంది.

స్పెషల్ బెడ్ ఫర్ వాష్‌రూమ్



బొల్లం సందీప్, దోరెపల్లి జెడ్పీహెచ్ఎస్, కనగల్

నల్లగొండ: కనగల్ మండలం దోరెపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బొల్లం సందీప్ (ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు) గైడ్ టీచర్ శ్రీనివాస్‌రెడ్డి సూచనలతో రూపొందించిన స్పెషల్ బెడ్ వృద్ధులు, బెడ్‌పై నుంచి లేవలేని వారికి ఎంతో ఉపయోగపడుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారు వాష్‌రూమ్‌కు వెళ్లకుండానే బెడ్‌లో ఉండి కాలకృత్యాలు తీర్చుకునేలా ఈ ఎగ్జిబిట్‌ను రూపొందించారు. బెడ్ కింద బేషిన్ ఏర్పాటు చేశారు. పడుకున్న వ్యక్తి తనకు చేతులు పని చేస్తే ఆ బెడ్ పక్కన ఏర్పాటు చేసిన బటన్ నొక్కితే బెడ్ పైకి లేస్తుంది. దాంతో అతను సాధారణంగా కుర్చొనట్లుగానే కాలకృత్యాలు తీర్చుకోవచ్చు. ఆ బేసిన్‌లో నీటి సౌకర్యం ఉంటుంది. కాలకృత్యాలు అయిన తర్వాత తిరిగి బేసిన్‌ను క్లీన్ చేసుకోవచ్చు. 2022–23 విద్యా సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రదర్శించిన ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కాగా.. 2024 అక్టోబర్‌లో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో దీనిని ప్రదర్శించి పలువురి మన్ననలు పొందారు.

అదృశ్యమైన బాలిక ఎక్కడ..?

- స్నాప్‌చాట్ యాప్‌లో పరిచయమైన బాలుడిని కలిసేందుకు వచ్చి అదృశ్యం

కోదాడరూరల్: స్నాప్‌చాట్ యాప్‌లో పరిచయమైన బాలుడిని కలిసేందుకు ఐదు రోజుల క్రితం కోదాడకు వచ్చిన బాలిక కనిపించకుండా పోయింది. ఐదు రోజులవుతున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. కోదాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు కోదాడ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మేళ్లచెర్వు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తన తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటోంది. పదో తరగతి పూర్తిచేసిన ఆ బాలిక ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ వేసి ఇంటి వద్దే కుట్టు మిషన్ నేర్చుకుంటోంది.

స్నాప్‌చాట్ యాప్‌లో పరిచయమై..

వారిద్దరికి స్నాప్‌చాట్ యాప్‌లో పరిచయం ఏర్పడింది. ఈ నెల 24న సదరు బాలిక బంధువుల ఇంటికి వెళ్లొస్తానని చెప్పి కోదాడకు వచ్చి స్నాప్‌చాట్‌లో పరిచయమైన బాలుడిని కలిసినట్లు సమాచారం. బంధువుల ఇంటికని వెళ్లి మూడు రోజులు గడుస్తున్నా బాలిక తిరిగిరాకపోవడంతో ఆమె అమ్మమ్మ, తాతయ్య విషయాన్ని దగ్గరి బంధువులకు చెప్పారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి బాలిక అమ్మమ్మ, తాతయ్యకు ఫోన్ చేసి 'నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నా.. మీ అమ్మాయి కావాలంటే డబ్బులు ఇవ్వాలి' అని బెదిరించాడు. దీంతో బంధువులు ఇంట్లో ఉన్న బాలిక ఫోన్‌ను పరిశీలించగా కోదాడ మండలంలోని ఓ బాలుడితో ఆమెకు సోస్నాప్‌చాట్‌లో పరిచయం ఏర్పడినట్లు తెలుసుకున్నారు. దీంతో బాలిక బంధువులు బుధవారం కోదాడ మండలంలోని ఆ బాలుడి ఇంటికి వెళ్లి ఆరా తీయగా.. అతడు తన దగ్గరకే వచ్చిందని ఒప్పుకున్నట్లు తెలిసింది. బాలిక ఎక్కడ ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెప్పాడు. బాలిక కోదాడ వచ్చినప్పుడు తనతో మరో యువకుడు కూడా ఉన్నాడని కూడా చెప్పాడు. దీంతో బాలుడిని కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా.. వారు మేళ్లచెర్వు పోలీసులకు అప్పగించారు. మేళ్లచెరువు పోలీసులు ప్రాథమికంగా విచారణ చేయగా సదరు బాలుడు పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలిసింది.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వంశీ

నేరేడుచర్ల: పంజాబ్ రాష్ట్రంలో మార్చి 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పోలీస్ కబడ్డీ పోటీలకు నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ దారముళ్ల వంశీ ఎంపికయ్యాడు. నల్లగొండలోని 12వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వంశీ తెలంగాణ జట్టు తరపున జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు. వంశీ తల్లిదండ్రులు దారముళ్ల వెంకటయ్య, సైదమ్మ దంపతులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వంశీని పలువురు అభినందించారు.

వాగునీటి గుంటలో పడి బాలుడు మృతి



చరణ్‌తేజ్ (ఫైల్)

కనగల్: మండలంలోని జీ.యడవల్లి గ్రామ పరిధిలోని వాగునీటి గుంటలో పడి బాలుడు మృతిచెందాడు. ఏఎస్ఐ కె. నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జీ.యడవల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన భోపాల్, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు విగ్నేష్, చరణ్‌తేజ్(6) ఉన్నారు. గురువారం ఉదయం అరుణ కూలీ పనులకు వెళ్లగా.. భోపాల్ చిన్న కుమారుడు చరణ్‌తేజ్‌ని ఇంటి వద్ద ఉంచి పెద్ద కుమారుడు విగ్నేష్‌ను వెంట తీసుకొని గ్రామ శివారులోని తన వ్యవసాయం పొలానికి వెళ్లాడు. ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఉన్న చరణ్‌తేజ్ పొలం వద్దకు ఒంటరిగా బయల్దేరాడు. మార్గమధ్యలో వాగు నీటి గుంటలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మధ్యాహ్న సమయంలో అదే గ్రామానికి చెందిన పర్సనబోయిన స్వామి, స్వప్న దంపతులు నీటి గుంటలో తేలాడుతున్న చరణ్‌తేజ్‌ను గుర్తించి బయటకి తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు గుర్తించి అతడి తండ్రి భోపాల్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉత్కంఠగా ఎద్దుల పందేలు



బండను లాగుతున్న గిత్తలు

మేళ్లచెరువు: మండల కేంద్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. గురువారం నిర్వహించిన రెండు పండ్ల విభాగంలో 13 జతలు పాల్గొనగా ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూలపాడు గ్రామానికి చెందిన సూది బ్రదర్స్‌కు చెందిన ఎద్దుల జత మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా పల్నాడు జిల్లా విస్సాపురం గ్రామానికి చెందిన ఇట్టి రామాంజనేయులుకు చెందిన ఎద్దుల జత రెండో బహుమతి, గుంటూరు జిల్లా నవలూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావు, కోటేశ్వరరావులకు చెందిన జత మూడో బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తిలకించడానికి మేళ్లచెరువు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా రథోత్సవం



స్వర్ణ కల్పవృక్ష వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిది రోజు గురువారం ఉదయం ఆలయంలో అర్చకులు నిత్యారాధనలు, చతుస్థానార్చన మూర్తి కుంభ హోమం, ధన్వంతరి ఇష్టి హవనం నిర్వహించారు. అనంతరం స్వర్ణ కల్పవృక్ష వాహనంపై వేంకటేశ్వర స్వామిని అధిష్ఠించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7గంటల తర్వాత రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, ఆలయ ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపికృష్ణ దంపతులు, ప్రధాన అర్చకుడు శ్రవణ్‌కుమార్, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంక్చర్ షాపులో పేలిన ఎయిర్ గ్యాస్ సిలిండర్

మోతె: పంక్చర్ షాపులో ఎయిర్ గ్యాస్ సిలిండర్ పేలింది. మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో ఎస్‌కే యాకూబ్ పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం షాపు తెరిచి కారు టైరులో గాలి నింపుతుండగా.. ఒక్కసారిగా ఎయిర్ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో షాపులో ఉన్న వస్తువులన్నీ చల్లాచెదురయ్యాయి. షాపు యజమాని ఎస్‌కే యాకూబ్ ఎగిరి దూరంగా పడిపోవడంతో గాయాలయ్యాయి. ఇనుప రాడ్డు తగిలి కారు ముందు అద్దం పగిలిపోయింది. షాపు యజమాని ఎస్‌కే యాకూబ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని షాపు యజమాని కోరుతున్నాడు.

దొంగకు ఏడు నెలల జైలుశిక్ష

శాలిగౌరారం: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి బంగారు నల్లపూసల గొలుసును లాక్కెళ్లిన దొంగకు ఏడు నెలల జైలుశిక్ష విధిస్తూ నకిరేకల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ గురువారం తీర్పు వెలువరించారు. శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామానికి చెందిన చింతల లక్ష్మమ్మ(60) 2024 మే 15న ఇంటి నుంచి వ్యవసాయ పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన పోలెపాక రమేశ్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు నల్లపూసల గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ డి. సైదులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. గురువారం జరిగిన విచారణలో నేరం రుజువు కావడంతో పోలెపాక రమేశ్‌కు నకిరేకల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారు తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ కేసు వాదించారు. ఎస్ఐ సైదులు, లైజెన్ ఆఫీసర్ రవి, సీడీఓ రమేశ్ ఆధారాలను కోర్టుకు సమర్పించారు.



నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం కోనేరులో మహాశివరాత్రి సందర్భంగా గురువారం హంస వాహనంపై స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించారు.

రేపటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



విలేకరులతో మాట్లాడుతున్న ఈఓ భాస్కర్‌రావు

- 11వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాలు
- ఈఓ భాస్కర్‌రావు వెల్లడి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. గురువారం కొండపైన తన కార్యాలయంలో ఈఓ విలేకరులతో మాట్లాడారు. ఈ బ్రహ్మోత్సవాలకు రూ.3.15 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. మార్చి 1న స్వస్తీవాచనంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 11వ తేదీన రాత్రి శృంగార డోలోత్సవంతో ముగుస్తాయన్నారు. ఎదుర్కోలు ఉత్సవాన్ని 7వ తేదీన, తిరు కల్యాణ మహోత్సవం 8వ తేదీన, రథోత్సవం 9వ తేదీన నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే హవన, హోమాది పూజలు గతంలో ప్రథమ ప్రాకారంలో నిర్వహించేవారని, ఈసారి మాడ వీధుల్లో భక్తులకు కనిపించే విధంగా జరిపిస్తామన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్న వేదిక

రాత్రి 8.30 నుంచి 10 వరకు సేవలు..

గత నాలుగైదేళ్లుగా సాయంత్రం 6గంటలకే అలంకార, వాహన సేవలు చేపట్టామని, ఈసారి రాత్రి 8.30గంటల నుంచి 10 గంటల వరకు సేవను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపినట్లు తెలిపారు.

సాయంత్రం 5 నుంచి ఉచితంగా వాహనాలు..

బ్రహ్మోత్సవాలకు భక్తులు వచ్చే వాహనాలను కొండపైకి సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు టోల్ చార్జి లేకుండా ఉచితంగా అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. అదేవిధంగా భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం సైతం కల్పించామన్నారు.

ప్రముఖులచే సాంస్కృతిక కార్యక్రమాలు

మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నర్సింహారావుచే నృసింహ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. 4వ తేదీన ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌చే భక్తి సంగీత విభావరి జరిపిస్తామన్నారు. 5వ తేదీన ప్రముఖ జానపద, సినీ గాయని తేలు విజయచే భక్తి సంగీత కార్యక్రమం, 6వ తేదీన ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు, తిరుమల తిరుపతి ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌చే అన్నమయ్య సంకీర్తన విభావరి, 7న పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్‌చే అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు, భక్తి సంగీతం, 9న లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు, సంగీత దర్శకుడు కోమండూరి రామాచార్యులచే మ్యూజికల్ వేడుక ఉంటుందన్నారు.